'సర్.. ఈ సినిమాలో సుమోలు గాల్లో లేస్తాయా?': వి.వి. వినాయక్ బర్త్‌డే స్పెషల్
8 లో..

తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

ఇదండీ..కబురు..



సంపుటి : 22 సంచిక : 303 | గురువారం అక్టోబర్ 10 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

# త్వరలోనే అందరికి రుణమాఫీ చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి

కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 9

రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం అమ్మిన డబ్బులు మూడు రోజుల్లోనే వారి బ్యాంకు అకౌంట్లో జమ చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాల బావి వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్రం లోనే మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నల్గొండ జిల్లాలో గత సీజన్లో సైతం ధాన్యం కొన్న మూడు రోజుల్లోనే రైతులకు చెల్లింపులు చేశారని గుర్తు చేశారు. వానకాలం ధాన్యానికి సంబంధించి రైతులకు ఏవైనా ఇబ్బం దులు ఏర్పడిన లేదా చెల్లింపులు ఆలస్యమైన జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రత్యే కించి సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్ సైతం ఇస్తున్నదని పేర్కొన్నారు.గ్రేడ్ -ఏ ధాన్యానికి క్వింటాలుకు 2320 రూపాయల మద్దతు ధర, సాధారణ రకానికి 2320 రూపాయలు ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించిందన్నారు. మిల్లర్లు సన్న బియ్యంతో పాటు, దొడ్డు రకానికి సైతం ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా దొడ్డు ధాన్యాన్ని తీసుకోవాలని సూచించారు. రెండు లక్షల కన్నా ఎక్కువ ఉన్న వారి రుణాలను వారం పది రోజుల్లో రుణమాఫీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.



## ప్రతిపక్షం ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా.. డీఎస్సీ ప్రక్రియ ఆగలేదు



కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 9

కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం జరిగిందని.. అయినా, గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ఎలాంటి చర్య తీసుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. దశాబ్ద కాలం డీఎస్సీ గురించి ఆలోచన చేయలేదని ఆక్షేపించారు. పేదలకు నాణ్యమైన విద్య అందించాలనే తపనతోనే టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. ప్రతిపక్షం డీఎస్సీపై ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా, ఆటంకాలు సృష్టించినా అనుకున్న సమయానికి డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో టీచర్లకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. 02



# 'ప్రైవేటు'లో మీకంటే గొప్పవారు ఉన్నారా?

## డీఎస్సీ విజేతలతో సీఎం రేవంత్

నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలన్నారు. "తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిని భవిష్యత్తులో డాక్టర్లుగా, లాయర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కార్పొరేట్ బడిలో చదువుకోలేదు. 02



కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 9

డీఎస్సీ విజేతలను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్లు అనిపిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టీచర్లే తెలంగాణ వారధులు.. నిర్మాతలని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ కొత్త టీచర్లకు కీలక సూచనలు చేశారు.

# రాజకీయ పునరాగమనం అభినందనీయం

కాశ్మీర్ సిఎంగా మళ్లీ కాబోతున్నందుకు అభినందనలు

ఎక్స్ వేదికగా ఒమర్ అబ్దుల్లాను ప్రశంసించిన కెటిఆర్

యువతకు మోసం చేశారంటూ రాహుల్‌పై విమర్శలు



కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 9

కాశ్మీర్ ఎన్నికల్లో విజయం సాధించిన ఒమర్ అబ్దుల్లాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. అద్భుతమైన పునరాగమనం చేశారంటూ.. కితాబు ఇచ్చారు. 'వారు చెప్పినట్లు, మీరు మీ పునరాగమనం ఎదురుదెబ్బ కంటే మెరుగ్గా ఉండేలా చూసుకున్నారు..భారతదేశంలోని అత్యంత అందమైన రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నం దుకు శు భాకాంక్షలు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేటీఆర్ ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. రాహుల్ జీ, యువతకు ఇచ్చిన హామీలు అమలు చేసినందుకు ధన్యవాదములు..

మిగతాది 2లో

# పదేళ్లలో కేసీఆర్ సర్కారు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చింది

కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 9



గత పదేళ్లలో కేసీఆర్ సర్కారు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాము చిత్తశుద్ధితో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగులు తమ ప్రభుత్వంపై సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 150 మందికి మాత్రమే విదేశీ విద్యానిధి ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 500 మందికి విదేశీ విద్యానిధి ఇస్తోందని వివరించారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలను పొన్నం ప్రభాకర్ ఖండించారు. "మూసీ నిర్వాసితులకు పునరావాసం కల్పించాకే ఖాళీ చేయిస్తున్నాం. రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వడంతో పాటు నిర్వాసితుల పిల్లల విద్యకు చర్యలు తీసుకుంటాం. బీసీ సంక్షేమ శాఖ, బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖ ద్వారా కులగణన చేపడతాం" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ఈనెల 21 నుంచి 27వరకు

## తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 9

తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఈనెల 21 నుంచి 27వరకు తెలంగాణ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహించనుంది.మధ్యాహ్నం 12:30 నుంచే పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించనున్నారు. 02






# కాలుష్య నియంత్రణ మన తక్షణ కర్తవ్యం

- భూమిమీద కనీస బాధ్యత లేకుండా జీవనం తగదు
- భవిష్యత్ తరలా కోసం మనమంతా కష్టపడాలి
- డిప్యూడి సిఎం పవన్ కళ్యాణ్ పిలుపు

కబురు న్యూస్, విజయవాడ,అక్టోబర్ 9

రానున్న ఐదేళ్ల కాలంలో ఎంతవరకు కాలుష్యాన్ని నియంత్రించాలనే అంశంపై ఆలోచన చేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. నేను పర్యావరణ ప్రేమికుడిని.. ప్రకృతి బాగుండాలని కోరుకునే వ్యక్తిని.. ప్రకృతి ప్రేమికులు ఎంత తపన పడతారో నాకు తెలుసు. భూమి మీద కనీస బాధ్యత లేకుండా మనం జీవనం సాగిస్తున్నాం. భూమిని మనం సొంతం చేసుకోవడం కాదు.. భూమే ఏదొకనాటికి మనలను సొంతం చేసుకుంటుందని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో విజయవాడలో వర్కుషాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ..

మిగతాద్ది 2 లో

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం



# వ్యవసాయ ఉత్పత్తులా? కాలకూట విషాలా?

ఆహార భద్రత, పోషకాహారంపై 2011లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఒక పరిశీలన ప్రారంభించింది. భారతదేశ జనాభాలో 74.1 శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందటం లేదని తేల్చింది. గత ఏడాది విడుదలైన ప్రపంచ ఆకలి సూచికలో భారత్ 111వ స్థానం (మొత్తం 125 దేశాల్లో)లో ఉంది. ఈ శతాబ్ది మధ్య నాటికి దేశ జనాభా 172 కోట్లకు చేరుకుంటుంది. ఇందుకు అనుగుణంగా తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆహారధాన్యాలు, కూరగాయలు, పాల ఉత్పత్తి పెరగాలి. వాతావరణ మార్పులు సంభవిస్తే ఉత్పత్తిపై ప్రభావం ఉండొచ్చు. ఉదాహరణకు 2021లో 113 మిలియన్ టన్నుల గోధుమలు ఉత్పత్తి కాగా, 2022లో 107 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అయ్యాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల ఉత్పత్తి తగ్గిపోతే దాని ప్రభావం ఆకలిపై పడుతుంది. 2050 నాటికి ఆకలితో బాధపడే వారి సంఖ్య 11 నుంచి 20 శాతం వరకు పెరగవచ్చు. దేశంలో 2022 నుంచి తీవ్రమైన వడగాడ్పులు సర్వసాధారణమైపోయాయి. ఈ ఉష్ణోగ్రతకు కారణాలు నవీన నాగరికత పేరుతో ఎన్నో కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు, రసాయన పరిశ్రమలు, పురుగు మందుల కంపెనీలు. అలాగే స్వతంత్ర భారతావనిలో హరిత విప్లవం, క్షీర విప్లవం వల్ల వాతావరణ కాలుష్యంతో భూమి వేడెక్కడం ఆరంభమైంది. 1960లలో ఆరంభమైన హరిత విప్లవం ప్రజల ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపింది. ఆహార కొరత తీర్చాలంటే ఉత్పాదకత పెరగాలని ఎక్కడో మెక్సికోలో సంకరం చేసిన కొత్త వంగడాల్ని తీసుకొచ్చి పంజాబ్, హర్యానాలలో మన దేశవాళీ వంగడాలతో సంకరం చేసి కొత్త వంగడాల్ని తయారుచేసి ఉత్పాదకత ఎక్కువ వస్తుందని రైతులకు ఆశచూపి నూతన వంగడాలు వేయించారు. వాటికి మెల్లగా రసాయన ఎరువులు వాడించారు. ఈ వంగడాలకు రోగనిరోధక శక్తిలేక తెగుళ్లు వస్తే పురుగు మందులు చల్లించారు. ముందు రైతులు ఒప్పుకోకపోయినా తరువాత అలవాటు పడిపోయారు. దాంతో నిదానంగా అన్ని రాష్ట్రాలలో ఆహారధాన్యాలను సంకరం చేసి వాడించారు. ఆ విషపూరిత ఆహార పదార్థాలు తినడం వల్ల రోగగ్రస్త భారతావని తయారయింది. ప్రభుత్వాలు, పార్టీలు ఎన్ని మారినా ఈ రోజు వరకూ ఈ అనారోగ్యాలకు మూలకారణాలు పట్టించుకోవడం లేదు. భూమి విషపూరితమవుతూనే ఉంది. 147 మిలియన్ హెక్టార్ల భూమి ఇప్పటికే సారాన్ని కోల్పోయింది. వాతావరణ మార్పులు దీనికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2050 నాటికి వ్యవసాయ యోగ్యమైన భూమిలో సగం బీడుగా మారే ప్రమాదం పొంచి ఉంది. అంతిమంగా అది ఉత్పాదకత తగ్గడానికి దారితీస్తుంది. భూమిలో లవణాలు పేరుకుపోతున్నాయని, ఫలితంగా ఆహారభద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, దీంతో ఆర్థికాభివృద్ధి దెబ్బతింటుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2012–14లో వేసిన ఓ అంచనా ప్రకారం భూమిలో లవణాలు పేరుకుపోవడంతో అప్పటికి 16.84 మిలియన్ టన్నుల వ్యవసాయోత్పత్తులకు నష్టం చేకూరింది. పులిమీద పుట్రలా జలవనరుల లభ్యత కూడా తగ్గిపోతోంది. హరిత విప్లవంతో రైతులు గోధుమ, వరి పండించడం వల్ల ఎక్కువ నీటి వాడకం జరుగుతోంది. దేశంలో లభ్యమవుతున్న భూగర్భ జలాల్లో 89 శాతం వ్యవసాయానికే ఖర్చు అవుతున్నాయి. జనాభా అవసరాలకు అనుగుణంగా వ్యవసాయోత్పత్తులు పెరగకపోతే మన ఎగుమతులు తగ్గించుకోవడంతో పాటు, నిత్యావసరాలను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఇది మన విదేశీ వాణిజ్యంపై ప్రభావం చూపుతుంది. ఇప్పటికే మనం పప్పులు, వంటనూనెలు పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నాం. ఓ అంచనా ప్రకారం జనాభా అవసరాలు తీర్చాలంటే 2030 నాటికి 311 మిలియన్ టన్నులు, 2050 నాటికి 350 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలను మన దేశం ఉత్పత్తి చేయాలి. అందుకోసం ఉత్పాదకతనైనా లేదా సాగుభూమినైనా పెంచాలి. భవిష్యత్తులో ఆకలి కేకలు నివారించేందుకు ప్రభుత్వాలు వాస్తవాలు గ్రహించాలి. 1980 తర్వాత దాదాపుగా ప్రకృతి వ్యవసాయం కనుమరుగైంది. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, సంకరజాతి విత్తనాల వల్ల పండించిన పంటలు, కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు తినడం వల్ల దేశ జనాభాలో 80 శాతానికి మధుమేహం, కాలేయవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్లు, ఇంకా అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. వీటి బారి నుంచి బయటపడడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. దేశీ వంగడాల్ని మాత్రమే వాడేలా చూడాలి. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమిలో పేరుకుపోయిన లవణాలు రెండు మూడేళ్లలో నిర్మూలించవచ్చు. అలాగే విషరహిత ఆహారాన్ని పండించడం ద్వారా ఆరోగ్యవంతమైన, బలమైన భారతావనిని తయారు చేయవచ్చు. అందుకే రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి ఆరోగ్యానికి మార్గదర్శకులు కావాలి.

# రాజకీయ పునరాగమనం అభినందనీయం

మొదటిపేజీ తరువాయి

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అందించినందుకు ధన్యవాదాలు చెప్పటానికి అశోక్ నగర్ యువత వేచి ఉన్నారు.. 5 లక్షల యువ వికాసం సహాయం, పునరుద్ధరణకు కూడా ధన్యవాదాలు.. మీ హామీ పూర్తయినందున యువకులను కలవడానికి తిరిగి హైదరాబాద్‌కు రావడానికి స్వాగతం అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. ÷ూగా కర్ణాటకలో ఐదు, తెలంగాణలో ఆరు గ్యారెంటీలంటూ అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్.. హరియాణలో ఏడు గ్యారెంటీలని మభ్యపెట్టే ప్రయత్నాన్ని ఆ రాష్ట్ర ప్రజలు తిరస్కరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హామీల అమలులో కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని దేశం మొత్తం గమనిస్తోందనడానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో రాష్ట్ర ఎన్నికల్లో ఒక్కో గ్యారెంటీ పెంచుకుంటూ గారడీ చేద్దామని చూసిన కాంగ్రెస్ బొక్కబోర్లా పడిందని ఎద్దేవా చేశారు. హరియాణలో కాంగ్రెస్ ఓటమితోనైనా రాహుల్ గాంధీ బుద్ధి తెచ్చుకోవాలని, చెప్పేమాటలకు చేస్తున్న పనులకు పొంతన లేనప్పుడు ఇలాంటి చెంపపెట్టులాంటి ఫలితాలు తప్పవన్నారు. బుల్డోజర్‌రాజ్, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగ పరిరక్షణ పేరుతో ఆయన చేసిన డ్రామాలకు హరియాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. సోషల్ మీడియా విస్తృతి పెరిగిన ఈ రోజుల్లో రాష్ట్రాలు వేరైనా ప్రజల నుంచి వాస్తవాలు దాచడం సాధ్యంకాదన్నారు. కాంగ్రె?సతో హోరాహోరీ ఉన్న రాష్టాల్లోనే బీజేపీ గెలుస్తోందని, ఆ పార్టీ ఓటమికి రాహుల్‌గాంధీ బలహీన నాయకత్వంకూడా ఓ ప్రధాన కారణమన్నారు. బీజేపీని ఢీకొని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉందన్న విషయం ఆయా రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను చూస్తే అర్థమైపోతుందని తెలిపారు. మరోవైపు.. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులు వేతనాలు రాక విలవిలలాడుతున్నారని, ఈ దండగమారి పాలనలో పండుగపూట వారంతా పస్తులు ఉండాల్సిందేనా? అని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదారునెలలుగా జీతాల్లేవని, పంచాయతీ వర్కర్లు, మునిసిపాలిటీ కార్మికులు, ఆస్పత్రి సిబ్బంది, హాస్టల్ వర్కర్లు, గెస్ట్ లెక్చరర్లు.. ఇలా ప్రతీశాఖలో వేతనాల పెండింగ్ ఉందన్నారు. ఆయా ఉద్యోగులు తమ కుటుంబాలను నెట్టుకురావడానికి అప్పులుచేసి తిప్పలు పడుతున్నారని పేర్కొన్నారు. ఒకటో తేదీనే జీతాలిస్తామన్న మీ ప్రగల్భాలు ఏమయ్యాయని నిలదీశారు. ఉద్యోగగుల అవస్థను గుర్తించి తక్షణం వేతనాలు చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# కాలుష్య నియంత్రణ మన తక్షణ కర్తవ్యం

మొదటిపేజీ తరువాయి

పర్యావరణ పరిరక్షణకు నిపుణులు, మేధావులు, ఎన్జీవోల సూచనలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ వర్కుషాపు ద్వారా పరిశ్రమల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ రెండు అంశాలపై వేసే అడుగులపై అందరికీ స్పష్టత వస్తుందన్నారు. ఈ పీసీబీ ఛైర్మన్‌కు నా ఆలోచన చెప్పిన వెంటనే.. ఈ వర్కుషాపును ఏర్పాటు చేశారు. అన్ని రంగాల నిపుణులు, ఎన్జీవోలను ఆహ్వానించడం అభినందనీయం. 974 కిలోమీటర్ల కోస్టల్ కారిడార్ ఉంది.. దానిని అభివృద్ధి చేయాలి. పర్యావరణ సమతుల్యత దెబ్బ తినకుండా.. పరిశ్రమల ఏర్పాటు కావాలి. భవిష్యత్ తరాల కోసం.. మనమంతా ఇప్పటి నుంచే ఆలోచన చేయాలి. జల, వాయి కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ వర్కుషాపుకు వచ్చిన నిపుణులు సలహాలతో సమాజానికి మరింత మేలు జరగాలనేది నా ఆకాంక్ష. మీ అనుభవం, మీ మేధస్సు ఈ రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడాలి. విపరీతంగా కాలుష్యం పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. కాలుష్య కోరల నుంచి సమాజాన్ని రక్షించడంలో మీరంతా పాత్రధారులు కావాలి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అంటే.. పరిశ్రమల యాజమాన్యాలలో అపోహలు ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడతారనే అభద్రత పీసీబీపై ఉంది. దీంతో ఆ తర్వాత పాలకులు పరిశ్రమల ద్వారా వచ్చే కాలుష్యాన్ని పట్టించుకోవడం మానేశారు. ఇక నుంచి పరిశ్రమల ఏర్పాటు, కాలుష్యం నివారణ రెండు అంశాలపైన ప్రత్యేక దృష్టి పెట్టాం. మీ అమూల్యమైన సలహాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నా విజ్ఞప్తి అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో రిటైర్డ్ ఐఏఎస్ కృష్ణయ్య, ఐఏఎస్ జీ. అనంత రాము, వ్యర్థ పదార్థాల నిర్వహణలో పర్యావరణ సవాళ్లపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి. చంద్రుడు ఐఏఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. 'పరిశ్రమల అభివృద్ధితో పాటు, కాలుష్య నియంత్రణ కూడా అరికట్టేలా భాగస్వామ్యుల అభిప్రాయాలను తీసుకునేందుకు ఈ వర్కుషాపు. ప్రజల భాగస్వామ్యంతో సూచనలు, సలహాలతో ముందుకు సాగాలని భావిస్తున్నాం. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. భవిష్యత్‌లో పరిశ్రమల ఏర్పాటు చేస్తూనే కాలుష్యాన్ని ఎలా నివారించాలనే దానిపైనా ఆలోచన చేస్తున్నాం. స్వచ్ఛంధ సంస్థలు కూడా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నాయి. వారి సలహాలు కూడా తీసుకుని, కాలుష్య నియంత్రణకు కృషి చేసేలా ముందుకు సాగుతాం. ఈ వర్కుషాపులో తమ విలువైన సూచనలు చేసేందుకు నిపుణులు కూడా అనేక మంది వచ్చారు. జల కాలుష్యం, వాయి కాలుష్యం నివారించేందుకు పర్యావరణ చట్టం తీసుకు వచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత పరిశ్రమలు ఎక్కువుగా తెలంగాణాలోనే ఉండిపోయాయి. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే, ఆర్థిక ప్రగతి సాధించాలన్నా పరిశ్రమలు, అనుబంధ సంస్థలు అవసరం. కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకు అందరూ కృషి చేయాలి. పరిశ్రమల ఏర్పాటు ఎంత ముఖ్యమో, ప్రజల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. అందరి అభిప్రాయాలు ఆలోచనలు పంచుకుని.. పరిశ్రమల ఏర్పాటుతో పాటు, కాలుష్య నివారణ లక్ష్యంగా పని చేయాలని కృష్ణయ్య వెల్లడించారు.

# 'ప్రైవేటు'లో మీకంటే గొప్పవారు ఉన్నారా?

మొదటిపేజీ తరువాయి

మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి. తెలంగాణలో 30వేల పాఠశాలలు ఉంటే.. 24లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే 34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా?" అని ప్రశ్నించారు.

## ఎందుకలా జరుగుతోందో ఆలోచించండి..

"ప్రభుత్వ బడికి వెళ్లడమంటేనే గ్రామాల్లో సైతం నామోషీగా భావిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి పోయిన వారు కూడా తాము తిన్నా తినకపోయినా, పుస్తెలు అమ్మి అయినా తమ పిల్లలను ప్రైవేటు బడి, కాన్వెంట్‌కు పంపాలనుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలకు పంపాలంటే.. ఎందుకు ఇబ్బందిపడుతున్నారో ఆలోచించండి. మీకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటా.. కానీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మీరు కృషిచేయండి. స్కూళ్లలో అన్ని వసతులూ కల్పించేందుకు కృషిచేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 11న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శ్రీకారం చుడుతున్నాం. విద్యకు బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాం. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరిస్తున్నాం.

## 65 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేశాం..

"ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. రెండుసార్లు కోరి కొఅవి దెయ్యాన్ని తెచ్చుకున్నట్లుగా బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చాం. ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశించినా.. తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్లకు నియామక ప్రక్రియ పూర్తి చేశారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు తీర్చలేదు. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యోగాలు ఊడాలని గతంలో చెప్పాను. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారు. 90 రోజుల్లో 30వేల కొలువులు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశాం. 65 రోజుల్లో డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశాం.

## పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కవితకు ఎమ్మెల్సీ పదవి..

రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వ బడుల పాత్ర కీలకం. డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవాలని కొఅవి దెయ్యాలు యత్నించాయి. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవడానికి కుట్రలు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భవిష్యత్తు తరాలకు టీచర్లు ఆదర్శంగా మారబోతున్నారు. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కళ్లల్లో కారం పెట్టుకొంటారు. ఎంపీగా కవిత ఓడిపోగానే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కుమార్తెకు మాత్రం 6 నెలల్లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల మేలు కోసం విశ్రాంతి తీసుకోకుండా శ్రమిస్తున్నాం. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలి. తెలంగాణ సమాజంపై బీఆర్ఎస్‌కు ఎందుకంత కోపం? ఏడు లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు పోయాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. మా ప్రభుత్వాన్ని పడగొడతామని బీఆర్ఎస్ అంటోంది.. ఇది న్యాయమా? బీఆర్ఎస్‌కు అధికారం రాదు.. తెలంగాణ ప్రజలు ఇవ్వరు?

## ఒలింపిక్స్‌లో పతకాలు రావడంలేదెందుకు?

విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తాం. రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నారు. నైపుణ్యాలు పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ప్రారభించాం. స్కిల్ వర్సిటీ ద్వారా సాంకేతిక నైపుణ్యం అందిస్తున్నాం. ఒలింపిక్స్ వేదికల్లో దేశం పరిస్థితి ఏంటో చూశాం. నాలుగు కోట్ల జనాభా ఉన్న దక్షిణ కొరియాకు ఒలింపిక్స్‌లో 32 పతకాలు వస్తే.. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఆ తరహాలో ఒలింపిక్స్‌లో ఎందుకు పతకాలు రాలేదు? తెలంగాణ యువత మత్తుకు బానిసలయ్యారు. వ్యసనాలకు బానిసలై.. యువత తప్పుదోవ పడుతున్నారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు బంగారు పతకాలు రావాలి" అని పిలుపునిచ్చారు.

# ఈనెల 21 నుంచి 27వరకు

## తెలంగాణ గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు

మొదటిపేజీ తరువాయి

ఒకటిన్నర తర్వాత పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులకు అనుమతించరు. ఇక ఈ నెల 14 నుంచి వెబ్ సైట్‌లో హాల్ టికెట్స్ అందుబాటులో ఉండనున్నాయి. అభ్యర్థులంతా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఓ ప్రకటనలో సూచించింది. అదే విధంగా పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదు. ఇక గ్రూప్–1 మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్ 9న గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహించారు. 3.02లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. మెయిన్స్ పరీక్షలు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహించనున్నారు. మెయిన్స్ పరీక్షలో జనరల్ ఇంగ్లిష్ తప్ప మిగిలిన పేపర్లన్నీ అభ్యర్థులు ఎంచుకున్న భాషల్లో రాయాల్సి ఉంటుంది. గ్రూప్–1 మెయిన్స్‌లో మొత్తం ఆరు పేపర్లు ఉండనున్నాయి.

# ప్రతిపక్షం ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా.. డీఎస్సీ ప్రక్రియ ఆగలేదు

మొదటిపేజీ తరువాయి

"ఏళ్ల తరబడి పదోన్నతులు, బదిలీల్లేక టీచర్లు ఇబ్బందులు పడ్డారు. మా ప్రభుత్వం రాగానే టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తి చేసింది. డీఎస్సీపై ప్రతిపక్షం చాలా కుటిల ప్రయత్నాలు చేసింది. అయినా.. డీఎస్సీ ప్రక్రియ ఆగలేదు" అన్నారు.

మరోవైపు, రాష్ట్రంలో 10వేల మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 11,062 పోస్టుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కేవలం ఏడు నెలల్లోనే మెగా డీఎస్సీ ప్రక్రియను రేవంత్ సర్కార్ పూర్తి చేసింది. డీఎస్సీ పరీక్షలకు 2.46లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. బ్యాక్‌లాగ్ పోస్టులు మిగిలిపోకుండా మొత్తం ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. మొత్తం 2,515 స్కూల్ అసిస్టెంట్లు, 685 భాషా పండితులు, 6277 ఎస్‌జీటీ, 145 పీఈటీ, 103 స్పెషల్ ఎడ్యుకేటర్ల పోస్టులు, 281 ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను భర్తీ చేశారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి 761మంది, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లా నుంచి 82మందినియామక పత్రాలు అందుకోనున్నారు. కోర్టు కేసులు, ఇతర సమస్యలతో 1056 పోస్టుల భర్తీ ప్రక్రియ పెండింగ్‌లో ఉంది.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం...
## కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్

### - సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు



**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 09**



రైతుల సంక్షేమం కోసం అనునిత్యం ప్రభుత్వం పాటుపడుతుందని, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటలను విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. బుధవారం పోతంగల్ మండలంలోని హెగ్డోలీ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సోయా పంటకు 4892 రూపాయలు మద్దతు ధర ప్రకటించిందని, రైతులు తాము పండించిన పంటను కోనుగోలు కేంద్రలోనే విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మాంతు, సొసైటీ చైర్మన్ శాంతిశ్వర్ పటేల్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్,మాజీ జడ్పీటిసి పుప్పాల శంకర్,మాజీ ఎంపీపీ పవన్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి,స్థానిక నాయకులు హమీద్,గంగాధర్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## నవదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు..

### సరస్వతి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు...



**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 09**





బాన్సువాడ పట్టణంలోని టీచర్స్ కాలనీలో నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14 వ వార్షికోత్సవ దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతి మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాత మండపం ఆవరణలో గోవింద శర్మ అర్చకత్వంలో చండీ హెూమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బాడీ శ్రీనివాస్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు,సామూహిక కుంకుమార్చన, సాయంత్రం లలిత సహస్రనామ కార్యక్రమాలు నిత్యం నిర్వహించడంతో పాటు రాత్రి భజన కార్యక్రమం,దాండియా నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు రాత్రి అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాడి శ్రీనివాస్, అనిల్, జ్ఞానేశ్వర్, పవన్, యాదగిరి గౌడ్, హన్మండ్లు, రాజు, శ్రీనివాస్, భాస్కర్, భక్తులు మహిళలు దుర్గా సేవా సమితి తదితరులు పాల్గొన్నారు.

## అరె కటిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు..

### - సరస్వతి మాతగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు.

**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 09**





బాన్సువాడ పట్టణంలోని ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు అయిన బుధవారం అమ్మవారు సరస్వతి మాతగా భక్తులకు ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి 56 రకాల తీపి ప్రసాదాలను నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక సంఘ కుల పెద్దలు,సభ్యులు, భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి ఆలయంలో ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

### - పల్లకి సేవలో తరించిన ఎమ్మెల్యే పోచారం, ఆలయ ధర్మకర్త శంభూ రెడ్డి



**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 09**



బాన్సువాడ పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సంతోష్ శర్మ, విజయ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని సరస్వతి మాతగా అలంకరించి, ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి దంపతులు నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి సేవలో ఆలయ ధర్మకర్త శంభు రెడ్డి పల్లకి మోశారు. నవరాత్రుల్లో భాగంగా ఆలయ ధర్మకర్త శంభు రెడ్డి అన్ని తానే ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అమ్మవారి సేవలో తరిస్తున్నారు.ఆధ్యాత్మికత సేవలు ఏవైనా పోచారం శంభు రెడ్డి ముందుండి నడిపించడంలో తనదైన శైలిలో ఉత్సవాలు జరిపించడం అతనికి అతనే సాటేనని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రతినిత్యం ఉత్సవాలకు పాల్గొనే భక్తులకు మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సరస్వతి ఆలయం భక్తుల తాకిడితో కళకళాడుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్ శర్మ, విజయ్ శర్మ, నాయకులు కృష్ణారెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా, పిట్ల శ్రీధర్, శేఖర్ రెడ్డి,అఖిల్, భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ మహాలక్ష్మి ట్రస్టు అధ్యక్షులుగా గంగాధర్ రావు పట్వారీ...

**కబురు న్యూస్,బోధన్ అక్టోబర్09..**



బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి ట్రస్ట్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ అధ్యక్షులు గంగాధర్ రావు పట్వారి గెలుపొందారు. బుధవారం జరిగిన హెూరాహెూరీ ఎన్నికలలో తన సమీప ప్రత్యర్థి మాజీ కౌన్సిలర్ రుద్ర సత్యనారాయణ పై ఆరు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అరవై ఆరు మంది సభ్యులు గల ట్రస్ట్ లో ఎన్నడు లేని విధంగా ఈ ఏడాది పోటీ ఏర్పడి ఎన్నికలు నిర్వహించారు. చివరి వరకూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి ప్రయత్నించినప్పటికీ సాధ్యంకాకపోవడంతో ఎన్నిక అనివార్యమైంది. గంగాధర్ రావు పట్వారీ కి 35ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి మాజీ కౌన్సిలర్ కు 29ఓట్లు వచ్చాయి. దీంతో గంగాధర్ రావు పట్వారీ గెలుపొందినట్లు ఎన్నికల కమిటీ ప్రకటించింది. ఉపాధ్యక్షులు గా సూర లింగంకు 32, ఉద్మీర్ సాయిలు కు 32ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శి బీర్కూర్ శంకర్ కు 36ఓట్లు వచ్చాయి. సంయుక్త కార్యదర్శి వీరాపురం చిన్న పోశెట్టి 34 ఓట్లు వచ్చాయి. కోశాధికారిగా శ్రీను 34 ఓట్లతో గెలుపొందారు. మరో ఎనిమిది మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికల్లో గెలిచారు. ఎన్నికల నిర్వహకులుగా న్యాయవాది పోశెట్టి, లోల శంకర్, ఎంబెల్లి శంకర్, సాయిలు, అజయ్ కుమార్, అబ్బయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా గెలుపొందిన మహాలక్ష్మి ట్రస్ట్ కమిటీ ప్రతినిధులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు.

## ఘనంగా పంటఖుర్దు జడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం...

**కబురు న్యూస్,బోధన్ అక్టోబర్09..**



బోధన్ మండలంలోని పంటఖుర్దు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999%-%2000 సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం బోధన్ నియోజకవర్గం సాలూర మండలంలోని కొప్పర్తి గ్రామ శివారులోని కళ్యాణ మండపంలో పంటఖుర్దు పాఠశాల పూర్వ విద్యార్థులు వారి కుటుంబాల సమేతంగా విచ్చేసి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి విద్య నేర్పిన గురువులను ముఖ్య అతిధులుగా ఆహ్వానించి పూల మాలలు వేసి, మెమోంటోలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ మ్యాజిషన్ యుగేందర్ చే ప్రత్యేక మ్యాజిక్ షో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్ రావు, దుర్గారావు, రామరాజు, బాల తిప్రురా దేవి, పూర్వ విద్యార్థుల సమ్మేళనం కో ఆర్డినేటర్లు భాస్కర్, విఠలేశ్వర్, రామకృష్ణ, నారాయణ, జ్యోతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయడంలోనే తృప్తి కలుగుతుంది....
## సామాజిక కార్యకర్త డాక్టర్ హకీమ్

### సామాజిక కార్యకర్త డాక్టర్ హకీమ్ ను సత్కరించిన స్నేహితులు

**కబురు న్యూస్ పొతంగల్ అక్టోబర్ 09**





సామాజిక సేవ కార్యకర్తగా తనకు చేతనైన సహాయం జీవితాంతం చేస్తానని, ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన పేద విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తూ ముందుకు వెళ్తానని సామాజిక కార్యకర్త డాక్టర్ హకీమ్ అన్నారు. బుధవారం పోతంగల్ మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త డాక్టర్ హకీమ్ ను ఆయన స్నేహితులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ వంతుగా సాయం చేసేందుకు బృందంగా ఏర్పడి సేవ చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. తాను స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేదని కేవలం తనపై ఆరోపణలు చేసేవారు ప్రజల్లో అపోహాలు సృష్టిస్తున్నారని, రిజర్వేషన్ల బట్టి నాయకుల అభిప్రాయాలు మారతాయని, రాజకీయాలకు కుల మతాలకు అతీతంగా ఉండి సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాను అన్నారు. ప్రజలకు సేవచేసే నాయకులు ఉన్నప్పుడే ప్రజలకు నాయకులపై గౌరవం కలుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో పోతంగల్ మండలంలోని అంగీర్గా ఫారం గ్రామంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను నిజమైన పేదవారికి ఇవ్వకుండా అన్హారుల కు ఇండ్లను కేటాయించారని ఆయన ఆరోపించారు. మాజీ జెడ్పిటిసి పుప్పాల శంకర్ ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పుప్పాల శంకర్, మాజీ సర్పంచ్ షేరు, సుగుణాకర్ రెడ్డి, ఫిరోజ్,పబ్బ శేఖర్, రాములు, బాబా, రిటైర్డ్ డిఈ కిషన్, విశ్రాంత ఎస్సై భీమయ్య, సజ్జద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ....



**కబురు న్యూస్,బోధన్ అక్టోబర్09..**

బోధన్ మండలం,పట్టణంలోని కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ తహసిల్దార్ విఠల్ ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ విఠల్ ఆధ్వర్యంలో టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్ బోధన్ మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, పౌల్, దూప్ సింగ్, అశ్వక్, బీజేపీ ఫ్లోర్ లీడర్ వినోద్, నాయకులు, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

## దుర్గామాత మంటపాలను దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్09**





బాన్సువాడ పట్టణంలోని గూడెంగల్లి లో గల చండీకామాత సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో కౌన్సిలర్ కాసుల రోహిత్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూధన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు ఈ సందర్భంగా దుర్గామాత మండప నిర్వాహకులు కాంగ్రెస్ నాయకులను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యూత్ కాంగ్రెస్ నాయకులు కాసుల రోహిత్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కనుకుట్ల రాజు,సేవా సమితి సంఘ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై మట్టి కుప్ప ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 09**



బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి పాత బాన్సువాడ వెళ్లే రహదారిలో రోడ్డు ప్రక్కన మట్టి కుప్ప గత 15 రోజులుగా ఉండడం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మట్టి కుప్పను తొలగించి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# వెంకటేశ్వర, రుక్మిణి సమేత విఠలేశ్వర, జోడు హనుమాన్ ఆలయాలతో విరజిలుతున్న ఇబ్రహీంపేట్ గ్రామం...





– కళ్యాణ మండప నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్న గ్రామస్తులు

**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 09**

బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో



గల శ్రీ వెంకటేశ్వర ఆలయానికి అనుసంధానంగా కళ్యాణ మండప నిర్మాణానికి గ్రామస్తులు బృందంగా ఏర్పడి దాతల నుండి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్త నాగులూరి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ గ్రామంలోని గ్రామ పెద్దలు యువకులు ప్రతి ఒక్కరు తమ వంతు సహాయ సహకారాలతో గ్రామంలోని వెంకటేశ్వర ఆలయ సమీపంలో కళ్యాణ మండప నిర్మాణానికి నడుం బిగించారన్నారు. సుమారు 700 సంవత్సరాల క్రితం వెంకటేశ్వర ఆలయం ఉన్నదని పూర్వీకులు, శాస్త్రవేత్తలు తెలిపారన్నారు. వెంకటేశ్వర ఆలయం రెండు పెద్ద బండల మధ్య వెంకటేశ్వర స్వామి వెలిశాడని పూర్వీకులు చెబుతారని, తెలుగు సంవత్సరం ఉగాది పండుగ రోజున ఆలయం చుట్టూ ఎడ్లబండ్లను ఊరేగించేవారన్నారు. విఠలేశ్వర రుక్మిణి ఆలయాలతో పాటు, చుట్టుపక్క ప్రాంతాల్లో ఎక్కడ లేని విధంగా జోడు హనుమాన్ ఆలయం



ఇబ్రహీంపేట్ గ్రామంలో ఉండడంవల్ల నిత్యం భక్తులు తరలివచ్చి ఆలయాలను దర్శించుకోవడంతో, భక్తుల రద్దీ దృష్ట్యా వసతి ఏర్పాటు చేయడంతో పాటు శు భకార్యాలు చేసుకునేందుకు వీలుగా కళ్యాణ మండప నిర్మాణాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. దుర్కి జక్కలదానితండా ప్రధాన రహదారి నుండి విద్యుత్ ఉపకేంద్రం నుండి ఆలయానికి నేరుగా నూతన మార్గాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దాతలు తమకు తోచినంత సహాయ సహకారాలు అందించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉద్దెర హన్మాండ్లు, మంత్రి గణేష్, బండి సాయిలు యాదవ్, బండి పండరి, గొల్ల రాములు, నాగులూరి శివకుమార్, జయరాం రెడ్డి,కాశీనాథ్ గుప్తా, శ్రీనివాస్ గౌడ్, సాయగౌడ్, గొల్ల శ్రీనివాస్, సాయికుమార్, లింగం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రుణాల పంపిణీలో లక్ష్య సాధనకు కృషి చేయాలి






– జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో అదనపు కలెక్టర్..

**కబురు న్యూస్,నిజామబాద్,అక్టోబర్ 09 :**

ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. ప్రత్యేకించి పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ మొదటి త్రైమాసిక సమావేశం జరిగింది. 2024-25 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి బ్యాంకుల వారీగా అదనపు కలెక్టర్ సమీక్షించారు. రూ 2640 కోట్లు పంట రుణాలుగా అందించాలని లక్ష్యం కాగా, రూ. 1011.95 కోట్లు పంపిణీ చేసి 38.33 శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందని, గడువు పూర్తయ్యేలోపు రైతులకు విరివిగా ఆర్థిక చేయూతను అందించి పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు అందరూ చొరవ చూపాలన్నారు. రబీలో రూ.1762.74 కోట్ల రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలని అన్నారు. గత 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ లో రూ. 2437 కోట్ల రుణాలకు గాను రూ. 1801.72 కోట్లు పంపిణీ చేసి 73.94 లక్ష్యాన్ని సాధించారని, రబీ సీజన్లో రూ.1625.20 కోట్లకు గాను రూ.1545.65 కోట్లు పంపిణీ చేసి 95.11 శాతం లక్ష్య సాధన జరిగిందని తెలిపారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని అన్నారు. క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ,శత శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు.ప్రభుత్వం వర్తింపజేసిన రుణమాఫీ ద్వారా అర్హులైన ప్రతి రైతు లబ్ది పొందేలా చూడాలన్నారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర పశు సంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర శాఖలతో సమన్వయము చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్దిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని హితవు పలికారు. రుణాలు తీసుకున్న వారు యూనిట్లు స్థాపించారా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తదుపరి సమావేశం నాటికి పరిస్థితిలో స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దని సూచించారు. వీధి వ్యాపారులకు విరివిగా ముద్ర రుణాలతో పాటు స్టాండ్ అప్ ఇండియా కింద రుణాలు అందించాలన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో అందిస్తున్న శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు యూనిట్ల స్థాపన కోసం రుణాలు అందించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.బి.ఐ ఏజీఎం పృథ్వీ,డీఆర్డీఓ సాయాగౌడ్,లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ అశోక్ చవాన్,నాబార్డు ఏజీఎం ప్రవీణ్ కుమార్,మెప్మా పీ.డీ రాజేందర్,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు,బ్యాంకర్లు పాల్గొన్నారు.

# రాజకీయ క్రీడల్లో బలవుతున్న పోలీసు అధికారులు

– బాన్సువాడ వర్గ పోరులో ప్రజలకు మేలు జరిగేనా...

**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 09**

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులు, అధికారులు తమ వంతు ప్రయత్నం చేస్తూ ప్రజల మన్ననలు ఒకవైపు పొందుతుంటే మరోవైపు రాజకీయ నాయకుల ఒత్తిడితో కొంతమంది అధికారులు తప్పుడు పనులు చేస్తూ, ప్రజలను ఇబ్బందులు పెడుతూ ప్రజల దృష్టిలో అవినీతి అధికారులుగా మచ్చ తెచ్చుకుంటూ ఉద్యోగానికి ఎసరు పెట్టుకునే విధంగా మార్చుకుంటున్నారు. మరి కొంతమంది నీతి నిజాయితీ కలిగిన అధికారులు తమ ఉద్యోగ బాధ్యతలను ప్రజలకు పాలకులకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తుంటే మరోపక్క రాజకీయ నాయకులు తమ వర్గ పోరులో నిజాయితీగా పనిచేసే అధికారులను బదిలీలు చేస్తూ ఒక వర్గంపై మరో వర్గంపై చేయి సాధించిందంటూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం



అధికారంలోకి రాగానే పోలీసుల బదిలీలు చేపట్టగా బాన్సువాడ పట్టణ సిఐగా మున్నూరు కృష్ణ, రూరల్ సీఐ సత్యనారాయణ గౌడ్, బదిలీపై వచ్చి ఆరు నెలలు కాకముందే మళ్లీ వీరిని బదిలీ చేయడంతో రాజకీయ చర్చ మొదలైంది. పట్టణ సీఐగా మున్నూరు కృష్ణ స్థానంలో మండల అశోక్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.ఇటీవల రూరల్ సీఐ సత్యనారాయణ గౌడ్ స్థానంలో ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న సాజిద్ అలీ బదిలీపై వస్తున్నారని ఉత్తర్వులు వచ్చినప్పటికీ, తిరిగి సత్యనారాయణ గౌడ్ ను సీఐగా కొనసాగించడంతో ఒక వర్గం పై చేయి సాధించిందని మరో వర్గం వీరిపై గుర్రుగా ఉండడంతో బుధవారం రూరల్ సిఐ బదిలీ అయ్యారని చర్చ మొదలవడంతో ప్రజలు వర్గ పోరులో ప్రజలకు ఏ మేరకు మేలు జరుగుతుందోనని చర్చించుకుంటున్నారు. కొత్తగా వచ్చిన పోలీసు అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తారో లేక వర్గ పోరులో ఇబ్బందులు, ఒత్తిళ్లకు తలొగ్గి అవినీతి,అక్రమ దందాలకు వంత పాడుతారో వేచి చూడాల్సిందే..రూరల్ సీఐ బదిలీ చర్చ వెనక రాజకీయ క్రీడల్లో అధికారులు బలవుతున్నారని, ఇకనైనా రాజకీయ నాయకులు అధికారులను ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలి గాని, తమకు అనుకూలంగా, లేదా ఒక వర్గం పై చేయి సాధించేందుకు పోలీసు అధికారులను బదిలీల పేరుతో తమ రాజకీయ క్రీడను చాటడం సమంజసం కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## ఆడపడుచులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు.... కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్

**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 09**

ప్రకృతిని పూలనే దేవతగా పూజించే ఏకైక పండుగ బతుకమ్మ పండుగ అని, రాష్ట్రంలోని మహిళలకు, విద్యార్థినులకు గురువారం సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ శు



భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పల్లెల్లో మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో పూలను బతుకమ్మగా పేర్చి ఆటపాటలతో సంతోషంగా బతుకమ్మ పండుగను జరుపుకోవడం తన చిన్ననాటి నుండి అక్క చెల్లెలుతో కలిసి బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకునేవారమని తన చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

## తిరుమలలో ఘనంగా సాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు...

శ్రీవారి సేవలో తరించడం పూర్వజన్మ సుకృతం... మాజీ సర్పంచ్ వెంకట రమణారావు దేశ్ముఖ్



**కబురు న్యూస్ తిరుమల అక్టోబర్ 09**







కలియుగ దైవం తిరుమల పుణ్య క్షేత్రంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన బుధవారం ఉదయం శ్రీవారు హనుమంతుని వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం గజవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనం ఇవ్వగా గోవింద నామస్మరణతో తిరుమల క్షేత్రం మారుమోగింది. బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటరమణారావు దేశ్ముఖ్ సుమారు 20 సంవత్సరాల నుండి బ్రహ్మోత్సవాలకు తిరుమల వెళ్లి శ్రీవారి సేవలో తరిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వెంకట రమణారావు దేశ్ముఖ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తిరుమలకు రావడం ఆనవాయితీగా మారిందని, గ్రామంలో తాను ఎంపీటీసీగా సర్పంచ్ గా పదవిలో ఉన్నప్పటికీ ప్రతి సంవత్సరం వెంకటేశ్వరుని సేవకు పది రోజులు శ్రీవారి సేవలో తరించుకోవడం తన పూర్వజన్మ సుకృతం అన్నారు.

# పేదవాడికి వజ్రాయుధం సమాచార హక్కు చట్టం

**కబురు న్యూస్,నిజామాబాద్ అక్టోబర్ 09:**

సమాచార హక్కు చట్టం పేదవాడికి వజ్రా యుధమని రాష్ట్ర డైరెక్టర్ మాజీ న్యాయమూర్తి ఎంఎస్ సలీం అన్నారు.గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో సమాచార హక్కు చట్టం 2005 వార్షికోత్సవం జరిపి మాట్లాడారు.నిజామాబాద్ జిల్లాలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం




జరిగిందన్నారు.అధ్యక్షులుగా కాంతపు గంగాధర్ ఉపాధ్యక్షులుగా ముత్తన్నపల్లి నాగరాజు జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా జై స్వప్న నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఖాన్ జైన్ సెక్రటరీగా ఈ చంద్రశేఖర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గా చింత రాజేందర్ మంగోలి ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినదని అన్నారు.గతంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగా పని చేసినటువంటి ఆదే ప్రవీణ్ ను రాష్ట్రస్థాయిలో రాష్ట్రస్థాయి కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.గత సంవత్సరం సమాచార హక్కు చట్టం 2005 పైన అనేక కార్యక్రమాల నిర్వహించి ప్రజలను చైతన్యవంతులుగా చేసినటువంటి ప్రతినిధులకు జిల్లా స్థాయిలో ప్రశంసా పత్రాలను మెడల్స్ ను మొమెంటులను అందించి సత్కరించడం జరిగిందన్నారు.

# అమ్మవారి సేవలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**కబురు న్యూస్,నిజామాబాద్ అక్టోబర్ 09 :**



నగరంలో పలు డివిజన్లో దేవి మండపం నిర్వాహకులు నిర్వహించిన అన్నదానం,పూజ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,దేవి నవరాత్రుల సందర్బంగా ఇందూర్ నగరంలో అంగరంగ వైభోవంగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణాలో దసరా,దేవి నవరాత్రులకు ప్రతేక స్థానం ఉందన్నారు చెడు పై సాధించిన విజయానికి గుర్తుగా దసరా జరుపుకోవడం,దసరా పండుగకు ముందు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించి భక్తి శ్రద్దలతో ఒక్కో రోజు, ఒక్కో రూపంలో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం ఇవ్వడం ప్రతేకం అన్నారు.అమ్మ ఆశీర్వాదంతో ఇందూర్ జిల్లా ప్రజలందరు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.అనంతరం వివిధ డివిజన్లో ఏర్పాటు చేసిన అన్నదానాలలో పాల్గొని భక్తులకు ఎమ్మెల్యే వడ్డించారు.ఈ కార్యక్రమంలో అమ్మ వారి మండపం నిర్వాహకులు,భక్తులు,బీజేపీ నాయకులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగా అభివృద్ధియే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



**గజ్వేల్ అక్టోబర్ 09,కబురు**
గత పదేళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు ఉపాధ్యాయ కొలువుల జాతర వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపుతుందని గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడేపల్లి భాస్కర్ గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సర్దార్ ఖాన్ పేర్కొన్నారు. ఈరోజు నూతన ఉపాధ్యాయ అభ్యర్థులు గజ్వేల్ ఐఓసి కార్యాలయం నుంచి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ సర్టిఫికెట్లు పొందటానికి హైదరాబాదులోని ఎల్బీ స్టేడియం బయలుదేరుతున్న సందర్భంగా వారిని కలిసి అభినందించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో గౌరవంతమైన వృత్తి ఏదైనా ఉన్నది అంటే అది ఉపాధ్యాయ వృత్తి అని దానిని మీరు చేపట్టబోతున్నారని సమాజాన్ని మంచిగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులది తమ కృషితో విద్యార్థులకు సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు చేయాల్సిన గురుత్రర బాధ్యత ఉందని అలాగే అలాగే ప్రైవేట్ విద్యా సంస్థలకు పోటీగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరిపి విద్య వ్యాపారికరణ నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులదేని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుఖెందర్ రెడ్డి డిసిసిబి మాజీ డైరెక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డి, అశోక్ రెడ్డి, నక్క రాముడు, దప్పు గణేష్, గుంటుకు బిక్షపతి, సురేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు

# సద్దుల బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి



**వేములవాడ అక్టోబర్ 8 కబురు:**
కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మంగళవారం వేములవాడలోని బతుకమ్మ తెప్ప వద్ద నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబురాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భారీ ఎత్తున నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. భారీ ఎత్తున వేలాదిగా మహిళలు తరలిరావడంతో సమూహాలుగా ఏర్పడి బతుకమ్మ, కోలాటాలు ఆడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ప్రతి ఒక్క సమూహం వద్దకు వెళ్లి అభివాదం చేశారు. బండి సంజయ్ ను కలిసేందుకు, ఆయనతో సెల్ఫీలు దిగేందుకు జనం పోటీలు పడ్డారు. అందరితో సెల్ఫీలు దిగుతూ ముందుకు సాగారు. అంతకముందు బండి సంజయ్ ఎములాడ రాజన్న ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు సంజయ్ కు ఘన స్వాగతం పలికారు. రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్ కు ఆలయ పూజారులు ఆశీర్వచనం అందించారు. అనంతరం కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో నిర్వహించే దాండియా వేడుకలకు హాజరయ్యేందుకు బయలుదేర వెళ్లారు.

# మెరుగైన సేవలు అందించేందుకు ఐసిడిఎస్ సూపర్ వైజర్లకు స్కూటర్ల అందజేత .....జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ఐసిడిఎస్ సూపర్వైజర్లకు, సఖి కేంద్రాలకు స్కూటర్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్**

**కబురు పెద్దపల్లి, అక్టోబర్ -09 :**
జిల్లాలోని మహిళలకు మెరుగైన సేవలు అందించేందుకు ఐసిడిఎస్ సూపర్ వైజర్లకు స్కూటర్ల అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.
బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి ఐసిడిఎస్ సూపర్వైజర్లకు, సఖి కేంద్రాలకు స్కూటర్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలోని బాధిత మహిళలకు మెరుగైన సేవలు మరింత వేగవంతంగా అందెందుకు మహిళా, శిశు , దివ్యాంగుల సంక్షేమ శాఖ పరిధిలో పని చేస్తున్న 31 మంది ఐసిడిఎస్ సూపర్వైజర్లకు ఒకటి చోప్పున, జిల్లాలో ఉన్న సఖీ కేంద్రానికి 3 , మొత్తం 34 స్కూటర్లను 20 వేల రూపాయల డౌన్ పేమెంట్ కలెక్టరేట్ నిధుల నుంచి చెల్లించి పంపిణీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ , ఏ.ఓ.శ్రీనివాస్ సి. డి.పి.ఓ. లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు







**- గౌరీమాతకు పూజలు నిర్వహించిన కలెక్టర్..**

**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,అక్టోబర్ 09 :**

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) వద్ద బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు,వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు.కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,అదనపు కలెక్టర్లు అంకిత్,కిరణ్ కుమార్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని గౌరీమాతకు,రంగురంగుల పూలతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసిన బతుకమ్మలకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ,పూల పండుగ ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ గేయాలను ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు యువతులు, మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సందడి వాతావరణం నెలకొంది.కార్యాలయ పనివేళలు ముగిసినప్పటికీ ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ ఉత్సవంలో పాల్గొని బతుకమ్మ వేడుక ఔన్నత్యాన్ని చాటారు.ఈ ఉత్సవాల్లో డీఆర్డీఓ సాయాగౌడ్,టీజీఓల సంఘం అధ్యక్షుడు అలుక కిషన్,రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమన్ రెడ్డి,కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్,వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీఎస్సీలో మాదిగ అభ్యర్థులకు అన్యాయం చేశారంటూ కలెక్టరేట్ ముందు నిరసన..

**కబురు న్యూస్,నిజామాబాద్ అక్టోబర్ 09:**



ఎస్సీ వర్గీకరణ అమలుకాకుండానే డీఎస్సీ ఫలితాలు ప్రకటించడంతో మాదిగ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం నల్లజెండాలో నిరసన తెలిపారు.అంతకు ముందు గౌతంనగర్ లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్ కు తరలివచ్చారు.ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి మాదిగ మాట్లాడుతూ,వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాలుగా రాజీలేని పోరాటం చేస్తున్నామని,సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణను అమలు చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని చారిత్రాత్మక తీర్పును ఇచ్చిందన్నారు.ఈ తీర్పుతో ముప్పై ఏళ్ల పోరాటానికి న్యాయమైన పరిష్కారం లభించిందన్నారు.సుప్రీం తీర్పు వచ్చిన అర గంటలోనే అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్పందిస్తూ,సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామని,దేశంలో వర్గీకరణను అమలు చేసే తొలి రాష్ట్రం తెలంగాణనే అవుతుందని ప్రకటించారని గుర్తు చేశారు.రెండు నెలలు గడుస్తున్నా ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకురాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇచ్చిన మాటను మర్చిపోయిన సీఎం రేవంత్ రెడ్డి డీఎస్సీ ద్వారా 11062 ఉద్యోగాలను భర్తీ చేస్తూ,మాదిగలకు ఘోరమైన అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేంత వరకు ఉద్యోగ నియామకాలు పూర్తిగా నిలిపివేయాలని కోరారు.నిరసనలో జిల్లా నాయకులు మైలరాం బాలు,యమున, సత్తెక్క, సావిత్రి పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కబురు కరీంనగర్ అక్టోబర్ 9**
తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం సాయంత్రం మహాత్మా జ్యోతిబాపూలె మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళా అధికారులు, సిబ్బంది తాము రూపొందించిన బతుకమ్మల్ని ఒకచోట చేర్చి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం మహిళలతో కలిసి జిల్లా కలెక్టర్ బతుకమ్మ పాటలకు ఆడిపాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ బతుకమ్మ ప్రాముఖ్యతను వివరించారు. పూలనే పూజించి దేవతలుగా కొలుస్తున్న ఏకైక గొప్పపండుగ బతుకమ్మ అని అన్నారు. మన పండుగ, మన సంస్కృతి ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక అన్నారు.



ప్రపంచవ్యాప్తంగా పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే ఏకైక పండుగ బతుకమ్మ అని తెలిపారు. అనంతరం బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దిన శాఖలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, మెప్మా, నగరపాలక సంస్థ, జిల్లాగ్రామీణ అభివృద్ధి శాఖ, రెవిన్యూ శాఖ, సిపిఓ, జెడ్పి సహా పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, టీఎన్జీవో నాయకులు, జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేసి లబ్ధిదారులను ఆర్థికంగా ఆదుకోండి

**కబురు జమ్మికుంటఅక్టోబర్ 09**
హుజురాబాద్ నియోజకవర్గం లో దళితులకు రెండో విడత రాని లబ్ధిదారులకు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగారి ప్రీతం ను హైదరాబాదులోని డి ఎస్ ఎస్ భవన్లోని తమ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దగాపడ్డ దళిత బంధు రెండో విడత పథకాన్ని వెంటనే విడుదల చేయాలని దళిత రత్న అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ ప్రభు కోరడం జరిగింది.ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ...నాటి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి దళిత బంధు పథకం ప్రవేశ పెట్టారని ఆ పథకం ద్వారా నియోజక వర్గంలో ఒక్కక్క కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి మంజూరు చేయగా అట్టి పథకంలో మొదటి విడుతలో ఐదు లక్షల విడుదల చేయగా, వివిధ వ్యాపారాలు పెట్టుకొని జీవిస్తున్న తరుణంలో షాపులకు అద్దె కట్టలేని పరిస్థితుల్లో అదనంగా అప్పులు చేస్తూన్నారని,



రెండో విడత 5 లక్షల రూపాయలు విడుదల చేస్తే వారి జీవితాలు అభివృద్ధి చెందుతాయనే ఆశతో నెట్టుకుంటూ వస్తున్నారని తెలిపారు, మిగత రెండో విడత లబ్ధిదారులు సుమారు 5 వేల మందికి శాసనసభ ఎన్నికల కోడ్ నిలిపివేయడం జరిగిందని తెలిపారు.తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచిన హుజురాబాద్ నియోజకవర్గం లోని దళితులకు రెండో విడత దళిత బంధు కోసం లబ్ధి దారులు వివిధ ప్రజా సంఘాలు , దళిత నాయకులు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.రెండో విడత కోసం న్యాయ పోరాటం చేస్తున్నటువంటి నాయకులను అక్రమ అరెస్టులు చేస్తూ పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తూ అణిచివేస్తున్నారని తెలియజేశారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి హుజురాబాద్ నియోజకవర్గం లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన దళిత బంధు రెండో విడత పథకాన్ని వెంటనే విడుదల చేసి లబ్ధిదారులను ఆర్థికంగా ఆదుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం కు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 9 కబురు**
దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 125 గాజులరామారం డివిజన్ పరిధిలోని ఉషోదయ కాలనీ లో అధ్యక్షుడు సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత మండపం వద్ద బుధవారం సరస్వతి రూపంలో కొలువుదీరిన జగన్మాత అమ్మవారికి ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి చల్లని చూపు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ కాలనీ ఫేస్ వన్ జనరల్ సెక్రెటరీ సతీష్ బాబు, ట్రెజరర్ నరసింహారెడ్డి, స్థానిక మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయుసి అధ్యక్షులు సీతారామయ్య ను సత్కరించిన కాంట్రాక్టు కార్మికులు



**కబురు న్యూస్, రామగుండం అక్టోబర్, 09:** సింగరేణి లో మొదటిసారి గా కాంట్రాక్టు కార్మికుల కు ఐదు వేల రూపాయలు లాభాల్లో వాటా బోనస్ ను ఇప్పించిన సందర్భంగా సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు బి గెస్ట్ హౌస్ లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లను కాంట్రాక్టు కార్మికులు వారికి పూల గుచ్చం అందించి, శాలువా లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ మాట్లాడుతూ సింగరేణి లో కాంట్రాక్టు కార్మికులు కూడా సంస్థ అభివృద్ధి కోసం పని చేస్తున్నారని, లాభాల్లో వారి శ్రమ ఎనలేనిదని, వారికి కూడా లాభాల్లో వాటా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని మన యూనియన్ అద్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య గారు డిమాండ్ చేయడం జరిగిందని ఆయన అన్నారు. సీతారామయ్య గారి కృషి వల్ల కాంట్రాక్టు కార్మికుల కు ఐదు వేల రూపాయలు లాభాల్లో వాటా బోనస్ మొదటి సారిగా హక్కును సాధించుకోవడం జరిగిందని ఆయన అన్నారు. భవిష్యత్తులో కాంట్రాక్టు కార్మికుల కు వేతనాలు పెంచాలని మరియు ఇతర సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అనంతరం సీతారామయ్య గారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం తో మాట్లాడి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు పోషం, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## సింగరేణి ని కాపాడుకుందాం



- రక్షణ తో కూడిన బొగ్గు ఉత్పత్తి ని సాధించుకుందాం.
- జిడికె 11వ ఇంక్లయిన్ లో జరిగిన బోనాల ఉత్సవాల్లో సీతారామయ్య

**కబురు న్యూస్, రామగుండం అక్టోబర్,09:** ఈరోజు గోదావరిఖని జిడికె 11వ ఇంక్లయిన్ లో దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జరిగిన బోనాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న గుర్తింపు సంఘం ఏఐటీయుసి అద్యక్షులు వాసిరెడ్డి



సీతారామయ్య. సింగరేణి కార్మికులు వారి కుటుంబ సభ్యులకు ముందుగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ లో సింగరేణికి నూతన బొగ్గు గనులు రావాలని, అందుకు ఏఐటియుసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఒత్తిడి తెచ్చి నూతన గనులను సాధించుకుంటామని, అందుకోసం సింగరేణి కార్మిక వర్గం ఏఐటియుసి చేసే పోరాట కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. అదే విధంగా దుర్గమ్మ తల్లి దీవెనలు సింగరేణి పై ఉండాలని, వారి కుటుంబాలపై అమ్మ వారి ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, పిట్ సెక్రటరీ ఎం.సంపత్, నాయకులు సిద్దమల్ల రాజు, ఎం.చక్రపాణి, నాయిని శంకర్, సంతోష్ రెడ్డి, శశాంక్, పొన్నం రంజిత్, ఆరేల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా బోనాల కార్యక్రమంలో గని అధికారులు, కార్మికులు, ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు గని ఆవరణలో డి.జే.పాటలతో , డప్పు చప్పుళ్ళతో నృత్యాలు చేస్తూ ప్రదర్శన లో పాల్గొన్నారు.

## సంక్షేమ యువసంఘం ఆద్వర్యం లో దుర్గ నవరాత్రి ఉత్సవాలు... మహా అన్నదానం



**కబురు :న్యూస్ కోరుట్ల:, అక్టోబర్ 9** కోరుట్ల పట్టణంలోని అయ్యప్ప గుట్ట ప్రాంతం 20వ వార్డు, బీసీ కాలనీ లో సంక్షేమ యువజన సంఘం అధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఉత్సవాలలో భాగంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో బాగుండాలని మహా అన్నప్రసాద దాతగా దువ్వ సత్యనారాయణ-గంగలక్ష్మి లు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలో సంఘ గౌరవఅధ్యక్షులు బింగి సంతోష్, అధ్యక్షులు కటుకం రవి, ఉపాధ్యక్షులు బింగి మహేష్,రుద్ర స్వామి, గొడ్డుబర్ల రాజేంద్రప్రసాద్,చిలుక ఆనందం, యువత అధ్యక్షులు వాసలసంతోష్,ఉపాధ్యక్షులు రాపెల్లి అన్వేష్, ప్రధాన కార్యదర్శి గడ్డం సాయికృష్ణ, సహాయ కార్యదర్శిలు బింగి ప్రవీణ్, కటుకంసాయితేజ,కోశాధికారి గన్నేరువరం ప్రవీణ్ గంగాధరి రాజేష్, రుద్ర నరేష్, సాడీగె మహేష్,మిట్టపల్లి శేఖర్, బాసమాధవ్, శ్రవణ్, ఉదయ్,సాయి సుందర్,నాగార్జున సాయిమనిశ్,వికాస్, శ్రీకాంత్, ఆకాష్, వివేక్, రాజకీయ నాయకులు, హాజరయ్యారు.పట్టణ వాసులు కాలనీ భక్తులు వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి హామీలు అమలు పరచాలి

- ఎస్సి వర్గీకరణ పై మౌనం వీడాలి
- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్



**కబురు న్యూస్, కోరుట్ల:: అక్టోబర్ 9** దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు ఆగస్టు ఫస్ట్ న ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై ఇచ్చిన సంచలనాత్మక తీర్పును గౌరవిస్తూ తెలంగాణ అసెంబ్లీ నిండు సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో వర్గీకరణ అమలు చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, అంబేద్కర్ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ముఖ్యమంత్రిని కోరారు. బుధవారం కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద డిస్సీ ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయక పోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలు చేస్తున్న నిరసనలో భాగంగా అంబేద్కర్ మాదిగ సంఘం అధ్యక్షుడు శనిగారపు రాజేష్ ఆద్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పేట భాస్కర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను అన్ని ప్రభుత్వ రంగాలతో పాటు డిఎస్సీ లో సైతం వర్గీకరణ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మాట నిలుపుకోవాలని ఈరోజు ఇవ్వనున్న డిఎస్సీ నియామకపు పత్రాలలో ఎస్సీ లకు సంబంధించిన 15 శాతం నియామకాలను అపివేయాలని వర్గీకరణ చేశాకే ఇవ్వాలని కోరారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ కులాల న్యాయ బద్ధమైన పోరాటంలో విఘాతం కలిగించే ప్రయత్నాలు మానుకోవాలని వర్గీకరణపై వేసిన అనేక రివ్యూ పిటిషన్లను సుప్రీం కోర్టు కొట్టివేసిందని ఇది మాల, మాదిగల పంచాయతీ ఏ మాత్రం కాదని ఎస్సీల లోని 59 కులాల సమాంతర ఫలాల పంపిణీ పోరాటం అని పేట భాస్కర్ అన్నారు. అంతకు ముందు అంబేద్కర్ భవన్లో బహుజన పితామహుడు మాన్య కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ మాదిగ కుల సంఘం అధ్యక్షులు శనిగారపు రాజేష్, మండల అధ్యక్షులు జాగర్ల రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రాజయ్య, సీనియర్ నాయకులు మారంపెల్లి నర్సయ్య, బొల్లే గంగాధర్, తాళ్లపెల్లి రాజగంగారాం, చిట్యాల మధు, వొటారికారి సాయన్న, రాజేందర్, బైరి రవిదాస్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు సన్మానం

- హరిహర పుత్ర ఇన్ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో బహుమతి ప్రధానం



**కబురు న్యూస్, రామగుండం అక్టోబర్,09:** రామగుండం కార్పొరేషన్ ఏరియా లోని లక్ష్మీ ఫంక్షన్ హాల్లో పద్మశాలి సేవా సంఘం యువజన సంఘం మహిళా సంఘం మరియు హరిహర పుత్ర ఇన్ఫ్రా డెవలపర్స్ సహకారంతో 2024 సంవత్సరానికి చెందిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మరియు ఇతర గ్రూపుల్లో అత్యంత మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు పద్మశాలి ప్రతిభ పురస్కార్ 2024 అవార్డు ప్రధానోత్సవం కార్యక్రమం పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు చిప్ప రాజేష్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి పద్మశాలి సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు రామ్మూర్తి హాజరై మాట్లాడుతూ పద్మశాలి సేవా సంఘం సభ్యత్వంలో గాని,సామాజిక సేవా కార్యక్రమంలో గానీ, కుల సంఘ సభ్యులను ఆదుకోవడంలో కానీ సంఘం ఎప్పుడు ముందుంటుందని రాష్ట్ర నాయకులు రామ్మూర్తి కొనియాడారు. అలాగే 2024 సంవత్సరంలో ఈ ప్రాంతంలో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమానికి హరిహరపుత్ర ఇన్ఫ్రాస్ డెవలపర్స్ ఆధ్వర్యంలో ఈ బహుమతులు ప్రధానం చేయడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చిప్ప రాజేష్ ప్రధాన కార్యదర్శి ఆడెపు శంకర్ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీ నరసయ్య కోశాధికారి సంపత్ కార్పొరేటర్ మహిళా సంఘం అధ్యక్షురాలు కొలిపాక సుజాత అందే సదానందం, హరిహర ఇన్ఫ్రా సిఇఒ పోరండ్ల ప్రవీణ్ కుమార్, నూతి తిరుపతి తో పాటుగా పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# చైతన్య నగర్ నవదుర్గ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమార్చన కార్యక్రమం.



**కబురు న్యూస్, ప్రతినిధి,మెట్ పల్లి, అక్టోబర్ 9.** జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలో చైతన్య నగర్ లో గల చైతన్య నగర్ నవదుర్గ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ నిర్వాహకులు జుంగుల అనిల్ రణం ప్రతినిధితో అన్నారు. ఈ కుంకుమార్చన కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ మీనా సుఖేందర్ గౌడ్ తో పాటు సుమారు 150 మంది మహిళలు వరకు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు సాయంత్రం నుండి మంటపానికి వచ్చి కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో గుండవేని శ్రీవర్ధిని దుర్గమ్మ అలంకరణతో అక్కడ ఉన్న వారందరినీ ఆకట్టుకుంది.అలాగే గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన అన్నారు. అన్న ప్రసాదాన్ని స్వీకరించి అమ్మ కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు జొంగుల అనిల్, గందే హర్ష వర్ధన్,అరుణ్, సునీల్, బైరి వంశీ, అభి, శ్రీకాంత్, అజయ్, సాయి, నితీష్, మున్నా, చింటూ, మహిళలు చెట్లపల్లి మీనా సుఖేందర్ గౌడ్, గందెపద్మావతి, కవిత, భాగ్య, భాగ్య,సునీత, ఉమా, భవాని, రేష్మ, రవళి, అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు, పాల్గొన్నారు.

## దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన జువ్వాడి కృష్ణారావు .



**కబురు న్యూస్, ప్రతినిది,మెట్ పల్లి, అక్టోబర్ 9.** దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కోరుట్ల నియోజకవర్గం మెట్టుపల్లి మండలంలోని ఆత్మ నగర్ గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు పత్రిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గం పాడిపంటలతో సస్యశ్యామలంగా సమృద్ధిగాసమగ్ర అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు అనంతరం మెట్టుపల్లి పట్టణ పరిధిలోని పలు దుర్గామాత మంట పాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు వెంట మెట్టుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి లింగం, కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్యనారాయణ, మెట్టుపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు పాలపు నీల, రాజు, తిరుపతి రెడ్డి ,మధు, మారుతి ,తదితరులు పాల్గొన్నారు

7

## పి ఆర్ టి యూ టి. ఎస్.అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులుగా దాసరి రఘు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**కబురు (ప్రతినిధి) రామగుండం అక్టోబర్,09:** ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పిఆర్ టి యూ) టి.ఎస్ రాష్ట్ర శాఖ అసోసియేట్ అధ్యక్షులు గా గోదావరిఖని పట్టణానికి చెందిన దాసరి రఘు ఏకగ్రీవంగా నియామకమయ్యారు. హైదరాబాద్ లో పిఆర్టియు రాష్ట్ర కార్యవర్గ సమావేశం అక్టోబర్ 7, 8 తేదీలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కాగా ఈ ఎన్నికలలో మంథని మండలంలో సూరయ్యపల్లి



( తెనుగువాడ) గ్రామం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ఎస్. జి. టి.గా విధులు నిర్వహిస్తున్న దాసరి రఘు ను రెండవసారి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికైన దాసరి రఘు మాట్లాడుతూ తనను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు గాను సహకరించిన పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కర్రు సురేష్ ప్రధాన కార్యదర్శి గండు కృష్ణమూర్తి, మంథని మండల అధ్యక్షులు దొంతుల కుమార్,ప్రధాన కార్యదర్శి ఎర్రం రమేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## వేములవాడ రాజన్నను దర్శించుకున్న కేంద్ర హెూంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ గారు





వేములవాడ కబురు సినిమా ప్రతినిధి:-
శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని కేంద్ర హెూం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ గారు మంగళవారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న కేంద్ర హెూమ్ శాఖ సహాయక మంత్రికి ఈవో కె.వినోద్ రెడ్డిగారు పూల మొక్కతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం అర్చకులు ఆశీర్వదించగా ఈవో లడ్డూ ప్రసాదం అందజేశారు.వారి వెంట ఏఈఓ లు బి .శ్రీనివాస్ జి.రమేష్ పర్యవేక్షకులు తిరుపతిరావు, అశోక్ ఆలయ సిబ్బంది ఎడ్ల శివ సాయి ,పురాణం వంశీ ఉన్నారు

## టెన్నిస్ లో ప్రతిభ చాటిన ఇన్స్పెక్టర్ ను అభినందించిన పోలీస్ కమిషనర్




కబురు ప్రతినిధి:-
అక్టోబర్ 3 నుండి 6 వ తేదీ వరకు హైదరాబాద్‌లోని వశిష్ట టెన్నిస్ అకాడమీలో జరిగిన 18వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఇన్స్పెక్టర్ కె.సతీష్, యం.రామారాయులు లు 30 ఏళ్ల జంట విభాగంలో రన్నర్స్ టైటిళ్లను కైవసం చేసుకున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. టెన్నిస్ లో ప్రతిభ చాటిన ఇన్స్పెక్టర్ సతీష్, రామారాయులు లను పోలీస్ కమిషనర్ అభినందించారు..

## బితెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారిని పరామర్శించిన ఈటెల,జెఎస్ఆర్



తెలంగాణ రాష్ట్ర భారీ నీటి పారుదల మరియు సివిల్ సప్లై శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి తండ్రి గారు పురుషోత్తం రెడ్డి గారి ఇటీవల మరణించిగా వారి కుటుంబ సభ్యులను మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ గారితో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి(జె ఎస్ఆర్ )గారు కలసి పరామర్శించారు.పురుషోత్తం రెడ్డి గారి చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని,వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

వేములవాడ కబురు ప్రతినిధి





శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు భాగంగా శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారు కాలరాత్రి అవతార అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్థానాచార్యులు అప్పాల బీమా శంకర్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి చతుషష్టి పూజలు నిర్వహించారు. నాగిరెడ్డి మండపంలో గాయత్రి జపం, చండీ హెూమం, గాయత్రి హవనాన్ని వేదమంత్రాలతో నిర్వహించారు. మూల నక్షత్రం సందర్భంగా పుస్తక రూపిని మహా సరస్వతి పూజ, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలాగే, బాల త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## స్థానిక ఖమ్మం రూరల్ మండలంలోని ప్రియదర్శిని సాంకేతిక మహిళల కళాశాలలో మహిళా అధ్యాపకులు మరియు విద్యార్థినులు ఆటపాటలతో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.






కబురు రూరల్ ప్రతినిధి:-
గునుక పూలు, తంగేడు పూలు,బంతి, చెమంతి, నంది-వర్ధనం మరియు ఇతర పులతో బతుకమ్మను అలంకరించి ప్రతిష్టించి, చుట్టూ పెద్ద వృత్తాన్ని ఏర్పరచుకొని ఆట పాటలతో తిరుగుతూ దూప దీప నైవేద్యాలను సమర్పించి ఆనందంతో వేడుకను జరుపుకున్నారు. కళాశాల యాజమాన్యం పూజా కార్యక్రమం తో వేడుకలను ఆరంభించారు.
ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ బతుకమ్మ అనేది తెలంగాణ యొక్క రంగుల మరియు ఉత్సాహభరితమైన పండుగని మరియు ప్రతి ప్రాంతంలో ప్రత్యేకంగా పెరిగే పువ్వులతో మహిళలు జరుపుకుంటారని ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి గోపాల్ మాట్లాడుతూ మహిళా అధ్యాపకులు మరియు విద్యార్థినులు ఉత్సాహంగా



పాల్గొన్నందుకు, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడంలో వారి ముఖ్యమైన పాత్రను గుర్తిస్తూ వారిని అభినందించారు. ప్రియదర్శిని కళాశాల సాంస్కృతిక వైవిధ్యం మరియు తెలంగాణ సంప్రదాయాలను పాటించటంలో తమ కళాశాల ఎప్పుడు ముందుంటుందని, మరియు రంగురంగుల పువ్వుల సమృద్ధి, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు సాంప్రదాయ వస్త్రధారణ మా కళాశాలకు




చాలా ప్రత్యేకమైన వేడుకగా గుర్తించబడిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని సంస్థల ప్రెసిడెంట్ కటేపల్లి అప్పారావు, ప్రియదర్శిని పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాదినేని రంగారావు, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, మరియు విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నుంచి నాలుగు కుటుంబాలు సిపిఐ లో చేరిక





- ఎర్ర జెండా కప్పి సాదరంగా ఆహ్వానించిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి

ఖమ్మం రూరల్ కబురు ప్రతినిధి
ఏదులాపురం బిఆర్ఎస్ పార్టీ నుంచి నాలుగు కుటుంబాలు బుధవారం సిపిఐ పార్టీలో చేరాయి. వీరికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ జండా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పొన్నెకంటి ఉపేందర్, వంశీ ,ఏర్పుల లాలయ్య, బుచ్చి రాములు మాట్లాడుతూ... సిపిఐ పార్టీతోనే బడుగు , బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతోనే పార్టీలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మెడకంటి చిన్న వెంకటరెడ్డి , జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కరరావు, ఐ ఏ ఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, మండల సమితి సభ్యులు వెన్నం భాస్కరరావు, మెడకంటి పెద్ద వెంకటరెడ్డి, వెంపటి సురేందర్, మామిడి శంకర్ రెడ్డి , వెంపటి రాము, మేళ్లచెరువు పెద్ద లాలయ్య, పొన్నెకంటి రామకృష్ణ, రామిశెట్టి మహేష్ , మేళ్లచెరువు వెంకన్న, ఏఐటీయూసీ నాయకులు టేకుమట్ల శ్రీను, మేళ్లచెరువు గురవయ్య, ఏర్పుల బ్రహ్మం, ఏర్పుల బాలు, పొన్నెకంటి చక్రవర్తి, యువజన సంఘం నాయకులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, గణపరపు ఉపేందర్, దండి రమేష్, మామిడాల కిరణ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి శాంతి కళ్యాణం శాంతి





ఖమ్మం కబురు ప్రతినిధి

ఖమ్మం నగరంలో బుధవారం నాడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి శాంతి కళ్యాణం బైపాస్ రోడ్డు అన్న ఎఫ్సిఐ బైపాస్ రోడ్డు ఖమ్మం లొ కళ్యాణం ని ఒంగోలు శేషగిరి శర్మ లక్ష్మి . మరియు కుమారి సాయి తేజస్వి సాయి శ్రావణి పరిటాల సత్యనారాయణ శారద రాజశేఖర్ రమ్య వీళ్ళ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 48వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామరావు గార్లు విచ్చేసి అందరూ కలిసి అత్యంత వైభవంగా ఈ కళ్యాణాన్ని నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు మాట్లాడుతూ స్వామివారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా వారు తెలియజేసినారు మొన్న జరిగిన వరదల ప్రజలు చాలామందిని నిరాశలయ్యారు వాళ్లందర్నీ దగ్గరుండి కాపాడిన ఘనత మీదేనని ఈ సందర్భంగా వారు తెలియజేస్తున్నారు

## మానవత్వం చాటుకున్న శ్రీ భద్రకాళీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు.

తెలంగాణ రాష్ట్రం వరంగల్ నగరంలోని శ్రీ భద్రకాళీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వరంగల్ జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతూ దసరా పండుగ సందర్భంగా వారికి నూతన వస్త్రాలు కొనుగోలు చేయడానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వం చూపారు.ఈ సందర్భంగా శ్రీ భద్రకాళీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భద్రకాళి దేవాలయం దగ్గర గల భద్రకాళి కట్టమీద ప్రతిరోజూ శుభ్రపరిచే మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులకు సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు కొనుగోలు చేయడానికి ఆర్థిక సహాయం అందించి వారికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ భద్రకాళీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకటనారాయణ,దయానంద్, సారంగపాణి,గన్ను సేట్ , బ్రూస్లీ,రమేష్, బ్రహ్మం, శ్రీకాంత్,నరేందర్ మరియు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు పాల్గొన్నారు.

# రాజేంద్రప్రసాద్‌కు ప్రభాస్ పరామర్శ

కబురు సినిమా అక్టోబర్ 9..



సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇంట్లో విషాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. గుండెపోటుతో ఆయన కుమార్తె గాయత్రి గత శనివారం మృతి చెందింది. అయితే రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ఆమెకు నివాళులు అర్పించడంతో పాటు రాజేందప్రసాద్‌ను పరామర్శించిన విషయం తెలిసిందే. ఇప్పటికే మెగస్టార్ చిరంజీవితో పాటు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, వెంకటేశ్ తదితరులు ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే కూతురు పోయిన బాధలో ఉన్న నటకిరిటిని తాజాగా నటుడు రెబల్ స్టార్ ప్రభాస్ పరామర్శించాడు. ఆయనకు ధైర్యం చెప్పారు. అనంతరం రాజేందప్రసాద్ కూతురు గాయత్రికి నివాళులు అర్పించాడు. సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి గుండెపోటుతో మృతిచెందింది. 38 ఏండ్ల గాయత్రికి గత రాత్రి గుండెపోటు రాగా.. కుటుంబ సభ్యులు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో చేర్చారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆమె చనిపోయారు. కాగా, రాజేంద్ర ప్రసాద్‌కు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలానే గాయత్రి కుమార్తె సాయి తేజస్విని బాలనటిగా మహానటి చిత్రంలో నటించారు.

## 'సర్.. ఈ సినిమాలో సుమోలు గాల్లో లేస్తాయా?':

# వి.వి. వినాయక్ బర్త్‌డే స్పెషల్

కబురు సినిమా అక్టోబర్ 9..ని యాక్షన్‌ను కొత్త తరహాలో చూపించి మాస్ ప్రేక్షకులతో విజిల్స్ వేయించారు. క్లాస్ ఆడియన్స్‌కు కావాల్సింది అందించింది చప్పట్లు కొట్టించారు. మధ్యలో పంథా మార్చినా 'అదుర్స్' అనిపించుకున్నారు. ఆ దర్శకుడెవరో కాదు వి.వి. వినాయక్ . నేడు 50వ పుట్టినరోజు జరుపుకొంటున్న ఈ డైరెక్టర్ సినీ ప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర సంగతులివీ..



### కసితో చెన్నైకు..

వినాయక్ పూర్తి పేరు గండ్రోతు వీర వెంకట వినాయకరావు. సినిమాలపై ఆసక్తితో చెన్నై వెళ్లి కొందరు కో- డైరెక్టర్లను కలిశారు. ఎప్పటి నుంచో పని చేస్తున్న వారంతా దర్శకులుగా ఎదగలేకపోవడంతో.. తనకీ అదే పరిస్థితి వస్తుందేమోనన్న భయంతో వినాయక్ ఇంటికెళ్లిపోయారు. 'ఇక్కడే ఏదైనా పని చూసుకో' అని తల్లి అనడంతో భావోద్వేగానికి గురయ్యారు. మరోవైపు గ్రామస్థుల సూటిపోటి మాటలు. తానేంటో నిరూపించుకునేందుకు మళ్లీ చెన్నై రైలెక్కారు. 'అమ్మ దొంగా!' తదితర చిత్రాల దర్శకుడు సాగర్ వద్ద అస్టిస్టెంటుగా పని చేశారు. తర్వాత, వేరే దర్శకుల వద్ద కో-డైరెక్టర్‌గా చాలా సినిమాలకు వర్క్ చేశారు.

### తొలి సినిమా.. కథ మారింది!

దర్శకుడిగా 'ఆది'తో తొలి ప్రయత్నంలోనే యాక్షన్‌కు కొత్త అర్థం చెప్పారు. ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కిన ఆ సినిమా టాలీవుడ్‌లో ప్రభంజనం సృష్టించింది. అయితే, ముందుగా అనుకున్న కథ వేరు.. తెరకెక్కింది వేరు. వినాయక్ రాసుకున్న ఫస్ట్ స్టోరీలో బాలకృష్ణ హీరో. ఆ కథలో.. బాలకృష్ణకు ఓ తమ్ముడుంటాడు. అతడిని కాపాడటానికి అన్నయ్య బాంబులు వేస్తాడు. కొన్నాళ్ల తర్వాత ఎస్పైగా తిరిగొచ్చిన అన్నయ్యకు.. తమ్ముడిని అరెస్టు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. తర్వాత ఎన్టీఆర్‌ని కథానాయకుడిగా అనుకోవడంతో కొన్ని మార్పులు చేశారు. బాల నటుడు (హీరో చిన్నప్పటి పాత్ర) బాంబు వేయడం, సుమోలు గాల్లోకి లేవడం వంటి సన్నివేశాలు జోడించారు. విజిల్ వేస్తే సుమోలు బ్లాస్ట్ అయ్యేలా.. హీరోయిజాన్ని కొత్త పంథాలో చూపించి ట్రెండ్ సెట్ చేశారు. 'నంది' అవార్డు అందుకున్నారు. 'దిల్', 'ఠాగూర్'.. ఇలా కెరీర్ ప్రారంభంలో వరుస విజయాల దర్శకుడిగా క్రేజ్ సొంతం చేసుకున్నారు.

### సుమో సన్నివేశాల ప్రభావం..

గతంలో ఓ సినిమా చిత్రీకరణ సమయంలో వినాయక్ ఎయిర్‌పోర్టుకు వెళ్లగా.. ఆయన్ను గమనించిన ఓ అభిమాని 'సర్.. ఈ సినిమాలో సుమోలు గాల్లో లేస్తాయా?' అని అడిగాడట. ఆయా సీన్స్ ప్రేక్షకులపై ఎంతటి ప్రభావం చూపాయో దాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో.. మాస్ ఇమేజ్ కోసం ప్రయత్నించే ప్రతి హీరోకి కేరాఫ్ అడ్రస్ వినాయకే. చిరంజీవి, బాలకృష్ణలాంటి అగ్ర కథానాయకుల నుంచి బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అఖిల్‌లాంటి యంగ్ హీరోలతోనూ ఆయన పని చేశారు. అయితే, మహేశ్ బాబుకు తగ్గ కథను రాయలేకపోయానని వినాయక్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం గమనార్హం. వేరే రచయితలు రాసిన కథలు (కృష్ణ, అదుర్స్ తదితర) తెరకెక్కించడం వల్ల తనలోని కొత్త కోణం బయటపడిందని, వినాయక్ అంటే యాక్షన్ మాత్రమే కాదని ఆ సినిమాలు నిరూపించాయని వినాయక్ అంటుంటారు.

# యానిమల్‌తో ప్రశంసలు ..విమర్శలూ ఎదుర్కొన్నా

నటి తృప్తి డిమ్రి వెల్లడి



యానిమల్' మూవీతో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్ననటి త్రిప్తి డిమ్రి ఆ సినిమా తర్వాత ఆమెకు బాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కాయి. తన తదుపరి చిత్రం 'విక్కీ విద్య కా వో వాలా వీడియో' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. 'యానిమల్' తర్వాత తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి మాట్లాడారు. ఆ సినిమా వల్ల ఫేమ్ మాత్రమే కాదు విపరీతమైన విమర్శలు చూశానని అన్నారు.

యానిమల్' విడుదలయ్యాక ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నా. జోయాగా యాక్ట్ చేసినందుకు నన్ను చాలామంది తిట్టారు. సోషల్‌మీడియా వేదికగా పలువురు నెటిజన్లు అసభ్యంగా ట్రోల్ చేశారు. వాటిని ఎలా తట్టుకోవాలో అర్థం కాలేదు. అలాంటి విమర్శలు ఎదుర్కొంటానని ఎప్పుడూ అనుకోలేదు. ఎంతో బాధపడ్డా. మానసికంగా ఆవేదనకు గురయ్యా. దానినుంచి బయటకు రావడం కోసం మూడు రోజుల పాటు ఏడుస్తూనే ఉన్నా. దానివల్ల బాధ కాస్త తగ్గింది. మనసు శాంతించింది. ఆ సమయంలో నా సోదరి ఎంతో సపోర్ట్‌గా నిలిచింది. నువ్వు ఏం చేశావో నీకు తెలుసు. కాబట్టి ఇతరుల మాటలు పట్టించుకోకు అని ధైర్యం చెప్పిందని తెలిపారు. రణ్‌బీర్ కపూర్, రష్మిక జంటగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించిన చిత్రం 'యానిమల్'. యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది తెరకెక్కింది. జోయాగా అలరించారు త్రిప్తి డిమ్రి. కథలో భాగంగా ఆమెపై కొన్ని ఇంటిమేట్ సీన్స్ చిత్రీకరించారు. ఆ సీన్స్‌పై పలువురు అభ్యంతరం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత త్రిప్తికి దేశవ్యాప్తంగా అభిమానులు ఏర్పడ్డారు. 'నేషనల్ క్రష్' అని ట్యాగ్ ఇచ్చారు. అభిమానులు చూపిస్తోన్న ప్రేమపై గతంలో ఓ సందర్భంలో మాట్లాడారామె. 'బాలీవుడ్‌లో కెరీర్ మొదలుపెట్టి దాదాపు ఏడేళ్లు అయ్యింది. అందుకు సంతోషంగా ఉన్నా. గొప్ప నటీనటులు, దర్శకులతో వర్క్ చేస్తానని కెరీర్ ఆరంభంలో ఎప్పుడూ అనుకోలేదు. 'లైలా మజ్ను' తర్వాత నటనలో శిక్షణ తీసుకొన్నా. ప్రేక్షకులు నా నటనతో కనెక్ట్ అవుతున్నారని చెప్పారు.

# త్వరలోనే

## బాహుబలి పెళ్లి...!

కబురు సినిమా అక్టోబర్ 9..

బాహుబలి ఫ్రాంఛైజీతో గ్లోబల్ స్టార్‌గా మారిన ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులను ఎంటర్‌టైన్ చేసే పనిలో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ ఎవరంటే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ప్రభాస్ పేరు చెప్పేస్తారు. ఇంతకీ స్టార్ యాక్టర్ ఎప్పుడు పెండ్లి పీటలెక్కబోతున్నాడన్నది మాత్రం ప్రశ్నగానే మిగిలిపోతుంది. త్వరలోనే వెడ్డింగ్ అంటూ నెట్టింట వార్తలు హల్ చల్ చేస్తున్నా.. దీనిపై అధికారికంగా క్లారిటీ రావడం లేదు. అయితే తమ ఫేవరేట్ హీరో ఎప్పుడు ఓ ఇంటివాడు కాబోతున్నాడన్న దానిపై ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. ప్రభాస్ పెద్దమ్మ శ్యామలాదేవి ఇటీవలే విజయవాడలోని కనకదుర్గ ఆలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. పెండ్లిపై నెలకొన్న ట్విస్ట్‌కు ఫుల్ స్టాప్ పెట్టేసింది. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రభాస్ వెడ్డింగ్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే ఉంటుందని చెప్పింది శ్యామలా దేవి.

అయితే ఇంతకీ ఎవరా అమ్మాయనేది మాత్రం చెప్పలేదు. ప్రభాస్ ప్రస్తుతం కల్కి 2898 ఏడీ సీక్వెల్, సలార్ 2, రాజా సాబ్ సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఇవే కాకుండా స్పిరిట్, కన్నప్ప, ఫౌజీ చిత్రాలు కూడా ప్రభాస్ ఖాతాలో ఉన్నాయి. మరి ప్రభాస్ నుంచి పెండ్లి ప్రకటన ఎప్పుడుంటుందనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.



# ఫీమేల్ లీడ్ రోల్‌గా సంయుక్త మూవీ

## క్లాప్ కొట్టిన నటుడు దగ్గుబాటి రానా




కబురు సినిమా అక్టోబర్ 9..

భీమ్లా నాయక్' సినిమాలో పవన్ కళ్యాణ్, నిత్యా మినన్ ఒక జంటగా నటిస్తే.. మరో జంటగా రానా దగ్గుబాటి, సంయుక్త నటించారు. ఈ సినిమాలో నిత్యామీనన్ పాత్రకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో అంతే ప్రాముఖ్యత సంయుక్త పాత్రకు కూడా ఉంటుంది. ఆ పాత్రలు వారిద్దరికీ మంచి పేరునే తెచ్చిపెట్టాయి. ఇక ఇప్పటి వరకు హీరోల పక్కన నటిస్తూ సక్సెస్ అందుకుంటున్న సంయుక్త తొలిసారి ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ థ్రిల్లర్‌తో తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆమె ప్రధాన పాత్రలో నటించబోతున్న చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమవగా.. ఈ సినిమాకు క్లాప్‌ను 'భీమ్లా నాయక్'లో తనకు భర్తగా నటించిన రానా దగ్గుబాటి కొట్టారు. ఈ సినిమా వరుస బ్లాక్‌బస్టర్స్ సినిమాలతో అలరిస్తున్న టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త తొలిసారిగా ఫీమేల్ సెంట్రిక్ మూవీ చేస్తున్నారు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి సెన్సేషనల్ హిట్ చిత్రాలను అందించిన సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండా నిర్మించనున్న ఈ చిత్రానికి యోగేష్ కెఎంసి దర్శకుడు. మాగంటి పిక్చర్స్‌తో కలిసి హాస్య మూవీస్ ప్రొడక్షన్ నంబర్ 6గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని సంయుక్తనే సమర్పిస్తోంది. బుధవారం రామానాయుడు స్టూడియోస్‌లో పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది.

# వార్-2లో విలన్‌గా ఎన్టీఆర్

కబురు సినిమా అక్టోబర్ 9..




తారక్ లేటెస్ట్ ఫిల్మ్ 'దేవర' హిట్టవ్వడంతో ఆయన మరింత జోష్‌లో సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ప్రశాంత్ నీల్ ఎన్‌టిఆర్31తో పాటు యశ్ రాజ్ ఫిల్మ్స్‌ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్ లోని వార్ 2 సినిమాలో పనిచేస్తున్నాడు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎన్టీయార్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలో తారక్ -హృతిక్ రోషన్‌కు మధ్యలో భారీ యాక్షన్ ప్యాక్‌డ్ సీక్వెన్సెస్ ప్లాన్ చేస్తున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్‌కి సంబంధించిన ఓ అప్డేట్ బయటకొచ్చింది.. స్పై యూనివర్స్‌లో భాగంగా నిర్మిస్తున్న ఈ ఫిల్మ్ షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే సినిమా మేజర్ పోర్షన్ షూటింగ్ పూర్తయింది. ఎన్టీయార్, హృతిక్ రోషన్ మధ్య జరగనున్న యాక్షన్ ప్యాక్‌డ్ క్లైమాక్స్ ఒక్కటి ఇంకా బాకీ ఉంది. దీంతో వచ్చే ఏడాది నవంబర్‌లో ఈ పార్ట్‌ని చిత్రీకరించడానికి సినీ యూనిట్ సిద్ధమైంది. ప్రత్యేకమైన డైట్‌ని పాటిస్తూ ఇద్దరు హీరోలు కండలు తిరిగిన శరీరాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే వీరిద్దరి మధ్య 'హ్యాండ్ టూ హ్యాండ్' ఫైట్ సీక్వెన్సెస్ కూడా ఉండనున్నాయట. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా తర్వాత గ్లోబల్ స్టార్ అవతారమెత్తిన తారక్‌కి ఇది బాలీవుడ్ డెబ్యూ కావడం విశేషం. అసాధారణమైన యాక్టింగ్, పవర్ ఫుల్ డైలాగ్ డిక్షన్, స్టైలిష్ డ్యాన్సులతో సకలవల్లభుడి గా తెలుగు ప్రేక్షకులకు మాత్రమే పరిమితమైన తారక్ ని బాలీవుడ్ తొలిసారి విట్ నెస్ చేయబోతుంది. డైరెక్టర్ అయాన్ ముఖర్జీ ఎన్టీయార్‌ని ఎలా ఉపయోగించుకొన్నాడని సర్వత్రా ఆసక్తి నెలకొంది. వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా దర్శక నిర్మాత ఆదిత్యా చోప్రా ఇప్పటికే ఏక్తా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్ సినిమాలని ఇన్‌క్లూడ్ చేశాడు. ఫ్యూచర్‌లో టైగర్ 3, ఆల్ఫా, పఠాన్ 2, టైగర్ వర్సెస్ పఠాన్ చిత్రాలను ప్లాన్ చేస్తున్నాడు

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com